సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం : 3 : జనవరి : 2024



ప్రియుడే హంతకుడు
బాబుసాయిపేటలో వివాహిత హత్య కేసులో ఆమె ప్రియుడే నిందితుడని పోలీసులు నిర్ధారించారు. - 8లో



అభివృద్ధే ధ్యేయం
అట్టడుగు వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు. - 9లో



రైతుల శ్రమదానం
కాళేశ్వరం ప్రాజెక్టులోకి నీరువచ్చే ప్రధాన రాచకాల్వ నుంచి వృథాగా పోతున్న వరద నీటిని రైతులు అరికట్టారు. - 10లో

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రిని కలిసిన శంకరమ్మ



ముఖ్యమంత్రికి శాలువా కప్పుతున్న శంకరమ్మ

మోత్కూరు: నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తెలంగాణ మలిదశ ఉద్యమ తొలి అమరుడు కాసోజు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ మంగళవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్

చౌటుప్పల్, వలిగొండ, సంస్థాన్ నారాయణపురం: ప్రజాపాలన గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే కోరారు. మంగళవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని 09, 10, 11వ వార్డుల్లో నిర్వహించిన గ్రామసభలను ఆయన సందర్శించి దరఖాస్తుదారులతో మాట్లాడారు. ఆయన వెంట ఆర్డీఓ జగన్నాథరావు, మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మున్సిపల్ కమిషనర్ సోలిపురం భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు. అదేవిధంగా వలిగొండ మండల కేంద్రంలో జరిగిన ప్రజాపాలన కార్యక్రమాన్ని కలెక్టర్ హనుమంతు కే.జెండగే పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అంజనీదేవి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మనోహర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు. సంస్థాన్‌నారాయణపురం మండలంలోని మర్రిబావితండాలో నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణను కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట మండల ప్రత్యేకాధికారి జైపాల్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నర్సింహారావు, ఏపీఎం యాదయ్య, సర్పంచ్ తులసి ఉన్నారు.

4న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల ఎంపిక

నల్లగొండ రూరల్ : జాతీయ సమైక్యత శిబిరానికి ఈ నెల 4న మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లను ఎంపిక చేయనున్నట్లు ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మద్దిలేటి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్సిటీ పరిధిలోని వలంటీర్లు ఈ ఎంపికకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఎంపికైన వలంటీర్లను ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు మేడ్చల్ మల్కాజిగిరిలోని ఎంఎల్‌ఆర్ కాలేజీలో నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరానికి పంపుతామని తెలిపారు. కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లిష్, హిందీ, నాయకత్వ లక్షణాలు, కల్చరల్ అంశాల్లో ప్రతిభ ఉన్న వారికి ఎంపికలో ప్రాధాన్యం ఉంటుందని వివరించారు.

జనవరి 7 నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు..

మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరిధిలోని కాలేజీలకు ఈ నెల 7వ తేదీ నుంచి 15 వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. 16న తరగతులు పునః ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.

108 ఉద్యోగుల జిల్లా కమిటీ ఎంపిక

భువనగిరి క్రైం: 108 ఉద్యోగుల యూనియన్ జేఏసీ జిల్లా కమిటీ ఎన్నికను మంగళవారం భువనగిరి పట్టణంలో ఉద్యోగుల జేఏసీ కమిటీ తెలంగాణ ఉద్యోగుల స్టేట్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా తొంట భాస్కర్, అధ్యక్షుడిగా అంగడి మహేష్, ఉపాధ్యక్షుడి బత్తిని రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా సేవర్తి విశ్వం, కోశాధికారిగా సుందగారి భాస్కర్, సహాయ కార్యదర్శులుగా శంకర్, విష్ణు మోహన్ రెడ్డి, సైదయ్య, మహేష్ తదితరులను ఎన్నుకున్నారు.

బంక్ వద్ద బారులు

భువనగిరి టౌన్ : ఆయిల్ ట్యాంకర్ల యజమానులు సమ్మె చేయబోతున్నారని వస్తున్న వార్తలతో వాహనదారులు పెట్రోల్ బంకుల దగ్గరకు పెద్ద ఎత్తున బారులుదీరారు. ప్రతి వాహనదారుడు ఫుల్ ట్యాంక్ చేయిస్తుండడంతో బంకులు ఖాళీ అయ్యాయి. దీంతో అన్ని బంక్‌లు నో స్టాక్ బోర్డు పెట్టాయి.



భువనగిరి పట్టణంలోని పెట్రోల్ బంక్‌లో బారులుదీరిన ద్విచక్ర వాహనదారులు



యాదగిరిగుట్టలోని పెట్రోల్ బంక్ వద్ద..



క్యాన్లలో పెట్రోల్ నింపుకున్న యువకుడు

అభయహస్తానికి 1,06,114 దరఖాస్తులు

భువనగిరిటౌన్: జిల్లా వ్యాప్తంగా ప్రజాపాలన కొనసాగుతోంది. గుర్తించిన గ్రామాల్లో షెడ్యూల్ ప్రకారం గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు మొత్తం 1,06,114 దరఖాస్తులు వచ్చాయి. రెండు రోజుల సెలవుల అనంతరం మంగళవారం 65 గ్రామాల్లో సభలు నిర్వహించగా 39,033 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

స్వాధీనానికి సన్నద్ధం

- జిల్లాలో పెద్దఎత్తున అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు
- రియల్టర్లకు అక్రమ రిజిస్ట్రేషన్లు
- సీఎం ఆదేశంతో క్షేత్రస్థాయిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు
- కబ్జాకు గురైన ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుని పేదలకు ఇచ్చేందుకు సన్నాహాలు



గతంలో చేసిన సర్వే వివరాలు.. (ఎకరాల్లో)

జిల్లాలో ప్రభుత్వ భూములు	భువనగిరి డివిజన్‌లో	చౌటుప్పల్ డివిజన్‌లో
82,672	49,064	33,608
రైతుల కోసం అసైన్డ్ చేసింది		
32,466	20,469	12,176
ప్రజా అవసరాల కోసం కేటాయించింది		
11,255	11,291	554

లీజుకు ఇచ్చిన ప్రభుత్వ భూమి 724 ఎకరాలు

ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములు 5,342 ఎకరాలు

అసైన్డ్ భూముల కేసులు, పీఓటీ కేసులు 5,208 ఎకరాలు

వివిధ కేసుల్లో ఉన్న అసైన్డ్ భూములు 2,703 ఎకరాలు

సాక్షి, యాదాద్రి: అసైన్డ్ భూముల క్రయవిక్రయాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకుని తిరిగి నిరుపేదలకు ఇవ్వాలని ఇప్పటికే సీఎం ఆదేశించారు. ఈమేరకు జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో సేకరిస్తున్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అమ్మకాలపై కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అసైన్డ్ భూముల ఎవరి వద్ద ఉన్నాయనే సర్వేను రెవెన్యూ అధికారులు పూర్తి చేస్తున్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదలకు పంచిన భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం బలవంతంగా లాక్కుందన్న ఫిర్యాదుల వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై వారు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు, పేదలకు ఇచ్చిన భూముల లెక్కలు సైతం తీస్తోంది. ప్రధానంగా జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల కబ్జాల్లోకి వెళ్లిన వందల ఎకరాల ప్రభుత్వ భూములు తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. అయితే నిరుపేదలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములు జిల్లాలో పెద్దఎత్తున చేతులు మారాయి. ముఖ్యంగా హెచ్‌ఎండీఏ, వైటీడీఏతోపాటు జిల్లాలోని పలు గ్రామాల్లోని రూ.కోట్లు విలువ చేసే భూములు రియల్టర్లు, పెద్ద రైతుల చేతుల్లోకి వెళ్లాయి. ఈ మేరకు అధికారులు పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించారు.

చేతులు మారిన అసైన్డ్ భూములు

జిల్లాలో ఇప్పటివరకు వేల ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుపేదలకు పలు పథకాల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసింది. సుమారు 30 వేల మందికి పైగా నిరుపేదలకు పంచిన ఈ భూములు సగానికి పైగా చేతులు మారినట్లు తెలుస్తోంది. భూములను అసైన్డ్ నిబంధనలకు విరుద్ధంగా అధికారులు రిజిస్ట్రేషన్ చేశారు. ముఖ్యంగా బొమ్మలరామారం, బీబీనగర్, వలిగొండ, తుర్కపల్లి, యాదగిరిగుట్ట, ఆలేరు, భువనగిరి, చౌటుప్పల్, రాజాపేట, మోటకొండూరు, ఆత్మకూర్ (ఎం) తదితర మండలాల సమీపంలో అసైన్డ్ భూములన్నీ రియల్టర్లు, నేతలు, కాంట్రాక్టర్లు, కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చారు. చాలా చోట్ల సంబంధిత అధికారులతో చేతులు కలిపి అసైన్డ్ చట్టానికి తూట్లు పొడిచి భూముల అక్రమ దందా కొనసాగిస్తున్నారు. రాజధానికి పక్కన ఉన్న ప్రాంతాల్లో అసైన్డ్ భూములు పెద్ద ఎత్తున ఇతరుల చేతుల్లోకి మారాయి. జాతీయ రహదారుల సమీపంలోని అసైన్డ్ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేసిన రియల్టర్లు వాటిని ప్లాట్లుగా చేసి రూ.కోట్లు దండుకున్నారు. తీరా ఇప్పుడు ప్రభుత్వం ఈ భూముల రికార్డులు తీస్తుండడంతో అసైన్డ్ భూముల్లో ప్లాట్లు కొనుగోలు చేసిన లబ్ధిదారులు ఆందోళనలో ఉన్నారు.

గతంలోనే తీసిన లెక్కలు..

అసైన్డ్ భూములకు సంబంధించి సర్వే గతంలోనే తేలినప్పటికీ రాజకీయ కారణాలతో చర్యలు లేకుండా నిలిచిపోయింది. గడిచిన 10 సంవత్సరాల్లో అసైన్డ్ అక్రమాలపై చర్యలు లేవు. అప్పట్లోనే జిల్లా యంత్రాంగం అక్రమాల లెక్కలు పూర్తి చేసింది. గతంలో కూడా సర్వే ద్వారా అసైన్డ్ భూములను గుర్తించారు. మళ్లీ వాటిని పరిశీలించి సాగు చేస్తున్నారా, కబ్జాకు గురైందా, వంటి వివరాలు సేకరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన భూమిని వ్యవసాయ పరంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వారసులొస్తున్నారు..!

- ఎంపీ టికెట్ రేసులో ముఖ్యనేతల కుటుంబ సభ్యులు
- నల్లగొండలో కాంగ్రెస్ నుంచి జానా తనయుడు రఘువీర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ నుంచి సుఖేందర్ రెడ్డి తనయుడు అమిత్‌రెడ్డి
- భువనగిరి టికెట్ ఆశిస్తున్న కోమటిరెడ్డి లక్ష్మి, సూర్యపవన్ రెడ్డి, కుంభం కీర్తిరెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: పార్లమెంట్ ఎన్నికల్లో పోటీలో నిలబడడానికి పలువురు నేతల వారసులు ఆసక్తి చూపుతున్నారు. నల్లగొండ ఎంపీ సీటు కోసం మాజీ మంత్రి జానారెడ్డి తనయుడు రఘువీరారెడ్డి ప్రయత్నాలు ప్రారంభించగా.. బీఆర్‌ఎస్ నుంచి శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్ ప్రయత్నాలు ప్రారంభించారు. భువనగిరి ఎంపీ స్థానంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తన సతీమణి లక్ష్మిని బరిలో నిలపాలనే ఆలోచన చేస్తున్నారు. మరో వైపు కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తనయుడు సూర్యపవన్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల మోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కలువడం చర్చనీయాంశమైంది.

వివిధ వేడుకలతో జనాల్లోకి..

అగ్రనేతల తనయులు వారి పుట్టిన రోజు, నూతన సంవత్సరం, సంక్రాంతి తదితర సందర్భాలను పురస్కరించుకొని ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కాంగ్రెస్ పార్టీ తరఫున నల్లగొండ ఎంపీ టికెట్ కోసం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి తనయుడు రఘువీర్‌రెడ్డి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రఘువీర్ తమ్ముడు జయవీర్ రెడ్డి సాగర్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడ టికెట్‌ను రఘువీర్‌రెడ్డికి ఇప్పించేందుకు జానారెడ్డి ప్రయత్నాలు చేసినా కుదరలేదు. ప్రస్తుతం పార్లమెంట్ కోసం పోటీ చేయించాలానే ఆలోచనలో భాగంగా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. మంగళవారం రఘువీర్ రెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా హైదరాబాద్‌తో పాటు హాలియాలోనూ పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు నిర్వహించారు.

బీఆర్‌ఎస్ నుంచి గుత్తా తనయుడు..

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి నల్లగొండ ఎంపీ స్థానం నుంచి పోటీ చేసేందుకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. డిసెంబర్ 31న ఆయన జన్మదినం సందర్భంగా గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో ఆయన మునుగోడు టికెట్ ఆశించినా అది సాధ్యం కాలేదు. ప్రస్తుతం పార్లమెంట్ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అంతేకాదు రెండు పార్లమెంట్ నియోజక వర్గాలైన నల్లగొండ, భువనగిరి ఏ నియోజకవర్గాల నుంచి అవకాశం ఇచ్చినా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఇటీవల నిర్వహించిన చిట్‌చాట్‌లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వెల్లడించారు.

ఎవరి ప్రయత్నాల్లో వారే..

అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో సూర్యాపేట టికెట్‌ను రాంరెడ్డి దామోదర్‌రెడ్డికి ఇవ్వగా.. పటేల్ రమేష్‌రెడ్డి వర్గీయులు ఆందోళనకు దిగడంతో పాటుఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. దీంతో ఆయనకు అప్పటి కాంగ్రెస్ నేతలు ఎంపీగా అవకాశం కల్పిస్తామని ప్రకటించారు. దీంతో ఎంపీ టికెట్ తనకే వస్తుందనే ఆలోచనల్లో రమేష్‌రెడ్డి ఉన్నారు. అయితే, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోవడంతో దామోదర్ రెడ్డి కూడా ఎంపీ టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది. ఇక బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి కూడా ఆశిస్తున్నట్లు తెలిసింది. బీజేపీ నుంచి గార్లపాటి జితేందర్, సంకినేని వెంకటేశ్వర్‌రావు, మన్నెం రంజిత్ యాదవ్, బండారు ప్రసాద్, గోలి మధుసూదన్‌రెడ్డి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. భువనగిరి ఎంపీ టికెట్ కోసం టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, తీన్మార్ మల్లన్న, జెడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నుంచి భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిట్టా బాలకృష్ణారెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్ ప్రయత్నిస్తుండగా, బీజేపీ నుంచి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఆశిస్తున్నట్లు తెలిసింది.

రంగంలోకి 'కోమటిరెడ్డి' కుటుంబం..

భువనగిరి పార్లమెంట్ సీటు కోసం 'కోమటిరెడ్డి' కుటుంబం రంగంలోకి దిగింది. ఇప్పటికే మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తన సతీమణి లక్ష్మిని భువనగిరి ఎంపీగా పోటీ చేయించాలన్న ఆలోచనల్లో ఉన్నట్లుగా చర్చ జరుగుతోంది. ఈ తరుణంలో కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి తనయుడు సూర్యపవన్‌రెడ్డి భువనగిరి ఎంపీగా పోటీ చేస్తారనే చర్చ జోరందుకుంది. అందులో భాగంగా నూతన సంవత్సరం పురస్కరించుకుని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిని కలువడం చర్చనీయాంశంగా మారింది. నూతన సంవత్సరం, సంక్రాంతిని పురస్కరించుకొని ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయ్యారు. మరోవైపు భువనగిరి ఎంపీ టికెట్‌ను కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కూతురు కీర్తిరెడ్డి కూడా ఆశిస్తున్నట్లు తెలిసింది.

సమస్యలు పరిష్కారమయ్యేనా..

- నిలిచిన సీసీఎంబీ పనులు
- యాదాద్రీశుడి ఆలయంలో పూర్తిస్థాయిలో సమకూరని వసతులు
- ముఖ్యమంత్రిని కలిసిన ఆలేరు, భువనగిరి ఎమ్మెల్యేలు
- సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, యాదాద్రి: గత ప్రభుత్వంలో యాదాద్రీశుడి ప్రధానాలయం మాత్రమే పూర్తి చేశారు. కొండపై భక్తులకు కనీస వసతులు కల్పించాల్సి ఉంది. తాగు నీరు, నీడ, డార్మెంటరీ భవనం నిర్మించాల్సి ఉంది. వీటితోపాటు కొండ కింద ఇంకా చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. అదేవిధంగా భువనగిరి నియోజకవర్గానికి మంజూరైన సీసీఎంబీ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనుల పూర్తికి భువనగిరి, ఆలేరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డిని నూతన సంవత్సరం సందర్భంగా కలిసి నియోజకవర్గాల అభివృద్ధి కృషి చేయాలని కోరగా.. వారికి ముఖ్యమంత్రి నుంచి స్పష్టమైన హామీ లభించింది. యాదగిరిగుట్టకు త్వరలో వచ్చి గుట్ట సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. సీఎంతోపాటు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను యాదగిరిగుట్టకు రావాలని ఎమ్మెల్యే ఐలయ్య ఆహ్వానించారు. కొండపైకి ఆటోల అనుమతి వంటి ప్రధాన అంశాలను కూడా సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి యాదాద్రిలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించి ఇచ్చిన నివేదిక అనంతరం తాను కూడా యాదాద్రికి వస్తానని ఐలయ్యకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

సీసీఎంబీ పూర్తి చేయాలని విజ్ఞప్తి..

భువనగిరి నియోజకవర్గానికి మంజూరైన సీసీఎంబీ నిర్మాణ పనులు ప్రారంభించే విధంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశాల ప్రధాన అంశాలను ముఖ్యమంత్రికి వివరించారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయింపు, మూసీ కాలువల ఆధునీకరణ, అభివృద్ధి, కాళేశ్వరం ప్రాజెక్టు పనుల పూర్తి చేసి రైతులకు సాగునీరివ్వాలని కోరారు. ఈమేరకు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

'అత్యాచారాల నిరోధక చట్టం' పుస్తకం ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న రాజేష్‌చంద్ర

భువనగిరి క్రైం: ఎస్సీ, ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకుగాను యాక్షన్ ఎయిడ్ ఆధ్వర్యంలో ముద్రించిన ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాల నిరోధక చట్టం పుస్తకాన్ని జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజేష్‌చంద్ర మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ చట్టంపై గ్రామాలతో పాటు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ పుస్తకం తెలుగులో తీసుకువచ్చినందుకు సంస్థ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో యాక్షన్ ఎయిడ్ హ్యూమన్ రైట్స్ డిఫెండర్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నురువంగ శివలింగం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు అన్నంపట్ల కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమంలో భాగస్వాములు కావాలి

సాక్షి,యాదాద్రి: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగే అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు.



కలెక్టరేట్‌లో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో కలెక్టర్ హనుమంతు, అదనపు కలెక్టర్లు వీరారెడ్డి, భాస్కర్‌రావు, అధికారులు

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న శ్రీఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించి, నైవేద్యాన్ని సమర్పించారు. ప్రధానాలయంలో నిత్యపూజలు కొనసాగాయి.

చిగురిస్తున్న ఆశలు


- మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటన
- గతేడాది వెలువడిన నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 99 ఖాళీలు
- ఈసారి పెరగనున్న పోస్టుల సంఖ్య



భువనగిరి లైబ్రరీలో చదువుతున్న నిరుద్యోగులు


భువనగిరి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మెగా డీఎస్సీ నిర్వహించేందుకు విద్యాశాఖ కసరత్తు చేపట్టింది. దీంతో జిల్లాలో డీఈడీ, బీఈడీ అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కాగా.. గతేడాది వెలువడిన డీఎస్సీ నోటిఫికేషన్‌లో భాగంగా జిల్లాలో 99 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సిద్ధమైంది. ఇందులో స్కూల్ అసిస్టెంట్లు 39, ఎస్జీటీలు 38, భాషాపండితులు 20, పీఈటీలు 2 పోస్టుల చొప్పున ఖాళీలు చూపారు. వీటి కోసం వేలాది మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పోస్టుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల నిరుద్యోగులు నిరుత్సాహ పడ్డారు. ప్రస్తుతం పదోన్నతులు చేపట్టడంతో పాటు పదవీ విరమణతో అయ్యే ఖాళీలతో పోస్టుల సంఖ్య పెరగనుంది. కాగా.. జిల్లాలో సుమారు 45 పాఠశాలల్లో పిల్లలు లేకపోవడంతో మూతపడ్డాయి. ఈ పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించే అవకాశం ఉంది. ఆయా పాఠశాలల్లో బోధించేందుకు ఉపాధ్యాయులు రానున్నారు.

నిరుద్యోగులకు మేలు



రెండేళ్ల క్రితం బీఈడీ పూర్తి చేశా. గతేడాది తక్కువ పోస్టులతో నోటిఫికేషన్ జారీ చేయగా దరఖాస్తు చేసుకున్నా. నిర్ణీత సమయానికి పరీక్ష నిర్వహించకపోవడంతో మధ్యలో కొన్ని రోజులు ప్రిపరేషన్ నిలిపివేశా. మళ్లీ మెగా డీఎస్సీ అనడంతో చదవడం ప్రారంభించా.
– మాధవి, భువనగిరి

చదవడం ప్రారంభించా



మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఈసారి పోస్టుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ఉన్నా. ప్రైవేట్ పాఠశాలలో బోధించడం మానేసి పరీక్షకు ప్రిపేర్ అవుతున్నా.
– మధు, భువనగిరి

మధ్యాహ్న భోజనం పరిశీలన

మోత్కూరు: మున్సిపల్ కేంద్రంలోని అంగడి బజార్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం అదనపు కలెక్టర్ వీరారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో అందిస్తున్న పౌష్టికాహారం విలువలను విద్యార్థులకు తెలిపారు. తరగతి గదులు పరిశీలించి, మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడారు. అనంతరం స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాల నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయుడు రాజిడి రవీందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు అరుణాదేవి, సౌజన్య, లలిత, జ్యోతి, సత్తయ్య, లక్ష్మి, ఎమ్మార్సీ సిబ్బంది ఉమారాణి, మోహనాచారి, పుష్ప, యాదగిరి ఉన్నారు.

రశీదులు అందజేయాలి

ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణలో దరఖాస్తుదారులకు రశీదులు అందించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని 8వ వార్డు అంగడి బజార్‌లో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణను పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది శ్రవణ్, అనిల్ ఉన్నారు.



ప్రాథమిక పాఠశాలలో వంటలు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

క్లుప్తంగా

గుండెపోటుతో డీపీఎంఓ మృతి


స్వజయనాథ్ (ఫైల్)

నాగార్జునసాగర్: నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని హిల్‌కాలనీకి చెందిన డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ (డీపీఎంఓ) ఎడ్ల స్వజయనాథ్(57) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. సోమవారం రాత్రి 10గంటల సమయంలో ఆయన గుండె నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు స్థానిక కమలానెహ్రూ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. స్వజయనాథ్ వైద్య ఆరోగ్య శాఖలో హెల్త్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రస్తుతం దేవరకొండ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం నిర్వహించిన స్వజయనాథ్ అంతిమయాత్రలో బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

నేరేడుచర్ల: మండలంలోని రాంపురం రోడ్డులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు నమ్మదగిన సమాచారం మేరకు సూర్యాపేట సీసీఎస్ పోలీసులు, నేరేడుచర్ల పోలీసులు మంగళవారం సాయంత్రం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో రామినేని శ్రీనివాస్, దేవరశెట్టి శ్రీను, పోలక వెంకటేశ్వర్లు, నంద్యాల సైదులు, గుత్తికొండ హరినారాయణరెడ్డి, వడిత్య లాలు, కొండయ్య ఉన్నారు. వారి నుంచి 7 సెల్‌ఫోన్లు, మూడు బైక్‌లు, రూ.19,100 నగదు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పచ్చిపాల పరమేష్ తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు, జరిమానా

మునుగోడు: చండూరు మండలం తాస్కానిగూడేనికి చెందిన మద్ది శివాజీ వారం క్రితం డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మునుగోడు పోలీసులకు పట్టుబడ్డారు. అతడిని మంగళవారం నల్లగొండ కోర్టులో ప్రవేశపెట్టగా ఒక రోజు జైలు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించిందని ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

రిమాండ్ ఖైదీ మృతిపై విచారణ

నల్లగొండ క్రైం: రిమాండ్ ఖైదీ మృతిపై ఈ నెల 9న దేవరకొండ ఆర్డీఓ కార్యాలయం వద్ద బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు దేవరకొండ ఆర్డీఓ రాములు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్డీఓ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దవూర మండలం గర్నెకుంట గ్రామానికి చెందిన ఇస్రాది వెంకటయ్య 2021 ఏప్రిల్ 17న రిమాండ్ ఖైదీగా ఉండగా మృతి చెందాడు. అతడి మృతిపై బహిరంగ విచారణ నిర్వహిస్తున్నందున ఏదైనా సమాచారం తెలియజేయాలనుకునే వారు ఈ నెల 9న దేవరకొండ ఆర్డీఓ కార్యాలయానికి ఉదయం 11 గంటలకు హాజరుకావాలని ఆర్డీఓ కోరారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

నేరేడుచర్ల: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం నేరేడుచర్ల మండలం ముకుందాపురంలో జరిగింది. ఎస్‌ఐ పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ముకుందాపురానికి చెందిన గీత కార్మికుడు బొమ్మకంటి బుచ్చయ్య (67) సోమవారం సాయంత్రం గ్రామ శివారులోని మల్లికంటి కోటయ్య పొలంలో తాటిచెట్టు ఎక్కుతుండగా జారి కిందపడడంతో తీవ్రగాయాలయ్యాయి. బుచ్చయ్యను మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి చనిపోయాడు. మృతుడికి భార్య వీరమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ప్రియుడే హంతకుడు

- బాబుసాయిపేటలో వివాహిత హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- వివాహేతర సంబంధం కారణంగానే ఘాతుకం
- వివరాలు వెల్లడించిన మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి


కేసు వివరాలు వెల్లడిస్తున్న మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి

త్రిపురారం: మండలంలోని బాబుసాయిపేటలో వివాహిత హత్య కేసులో ఆమె ప్రియుడే నిందితుడని పోలీసులు నిర్ధారించారు. వివాహేతర సంబంధం కారణంగానే నిందితుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను మంగళవారం త్రిపురారం పోలీస్ స్టేషన్‌లో మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి విలేకరులకు వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. బాబుసాయిపేట గ్రామానికి చెందిన కొండమీది సైదులు కుమార్తె స్వాతికి ఏడేళ్ల క్రితం నిడమనూరు మండలంలోని ఇండ్లకోటయ్యగూడేనికి చెందిన ఉదయగిరి నారాయణతో వివాహం జరిగింది. స్వాతికి ఇండ్లకోటయ్యగూడేనికి చెందిన దోరెపల్లి శ్రీరాములుతో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయం స్వాతి భర్తకు తెలియడంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఈ క్రమంలో స్వాతి బాబుసాయిపేటలో ఉంటున్న తన తల్లిదండ్రుల వద్దకు వచ్చి అక్కడే ఉంటూ కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తుంది. శ్రీరాములు స్వాతిని పెళ్లి చేసుకుంటానని నమ్మబలుకుతూ తరచూ బాబుసాయిపేటకు వచ్చి వెళ్తుండేవాడు. అయితే స్వాతికి తెలియకుండా శ్రీరాములు గత సంవత్సరం మరో అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. పెళ్లి అయినప్పటికీ శ్రీరాములు తరచూ స్వాతితో ఫోన్‌లో మాట్లాడుతుండగా శ్రీరాములు భార్యకు అనుమానం వచ్చి అతడిని నిలదీసింది. తాను స్వాతికి డబ్బులు ఇవ్వాలని అందుకే తరచూ ఆమె ఫోన్ చేస్తుందని శ్రీరాములు తన భార్యకు చెప్పాడు. ఇదే విషయమై శ్రీరాములు అత్తమామలకు అనుమానం కలిగి గ్రామ పెద్దలను ఆశ్రయించారు. దీంతో గ్రామ పెద్దలకు తెలిస్తే తనకు భార్య, కుమారుడు దూరమవుతారని, అదే విధంగా స్వాతి కూడా తనను పెళ్లి చేసుకోవాలని వేధిస్తుండడంతో ఎలాగైనా ఆమెను అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం శ్రీరాములు డిసెంబర్ 28వ తేదీ రాత్రి స్వాతికి ఫోన్ చేసి తన పల్సర్ బైక్‌పై బాబుసాయిపేటకు వచ్చాడు. అప్పటికే మేకల కొట్టంలో నిద్రిస్తున్న స్వాతితో మాట్లాడుతూ ఆమెను చంపాలని అనుకోగా ఏదో అలజడి రావడంతో స్వాతి తల్లిదండ్రులు ఎవరూ అని అడగడంతో స్వాతి తన భర్తే వచ్చాడని తల్లిదండ్రులకు చెప్పింది. తర్వాత శ్రీరాములు స్వాతిని పక్కనే ఉన్న ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లి వెనుక నుంచి ఆమె గొంతును కుడి మోచేతితో గట్టిగా అదిమిపట్టి ఎడమ చేతితో ముక్కు మూసి ఆమెకు ఊపిరి ఆడకుండా చేశాడు. దీంతో ఆమె మృతిచెందింది. అనంతరం స్వాతి మృతదేహాన్ని మేకల కొట్టంలోకి తీసుకొచ్చి ఎవరికి అనుమానం రాకుండా యథావిధిగా మంచంలో పడుకోబెట్టి ఆమె సెల్‌ఫోన్ తీసుకొని దుగ్గెపల్లి శివారులోని తన మామ సైదులు ఉంటున్న నంద్యాల సతీష్ తోట వద్దకు వెళ్లి అక్కడే ఉన్నాడు. డిసెంబర్ 29న త్రిపురారం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని విచారణ మొదలుపెట్టారు. విచారణలో భాగంగా మంగళవారం పోలీసులు శ్రీరాములు వద్దకు వెళ్లి ప్రశ్నించగా అతడు నేరాన్ని ఒప్పుకోవడంతో అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెంకటగిరి తెలిపారు. ఈ హత్య కేసును ఛేదించడంలో చాకచక్యంగా వ్యవహరించిన హాలియా సీఐ గాంధీనాయక్, త్రిపురారం ఎస్‌ఐ వీరశేఖర్, ఏఎస్‌ఐ రామయ్య, స్టేషన్ సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

వివాహేతర సంబంధాలతోనే..

ఎక్కువగా వివాహితల హత్యల వెనుక వివాహేతర సంబంధాలే ప్రధాన కారణంగా ఉంటున్నాయని, వివాహేతర సంబంధాలతో కుటుంబాలను రోడ్డుపాలు చేసుకోవద్దని మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి సూచించారు. మహిళలకు ఎలాంటి ఆపద ఉన్నా పోలీసులను ఆశ్రయించవచ్చన్నారు.

ఆత్మహత్య చేసుకున్న మృతుల వివరాలు లభ్యం


గోవిందరావు (ఫైల్)


పోతుల ఆదిలక్ష్మి (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: గత నెల 31వ తేదీన మిర్యాలగూడ రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడిన వారి వివరాలు లభ్యమైనట్లు జీఆర్పీ ఎస్‌ఐ సాలకమ్మ, రైల్వే ఎస్‌ఐ పవన్ కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. రైల్వే పట్టాలపై ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్న తర్వాత విచారణ చేపట్టగా.. మృతుడు సత్తివాడ గోవిందరావు(23) శ్రీకాకుళం జిల్లా పోలకి మండలం మబగం గ్రామానికి చెందిన వాడని తెలిసిందన్నారు. అతడు హార్వెస్టర్ ఆపరేటర్‌గా పనిచేస్తూ జీవనం సాగించేవాడన్నారు. మృతురాలు పోతుల ఆదిలక్ష్మి(36)ది కూడా శ్రీకాకుళం జిల్లా పోలకి మండలం తలసముద్రం గ్రామమేనని, ఆమెకు భర్త ముకుందరావు, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. డిసెంబర్ 29వ తేదీ ఉదయం తమ తమ గ్రామాల నుంచి సత్తివాడ గోవిందరావు, పోతుల ఆదిలక్ష్మి బయల్దేరి 31వ తేదీ ఉదయం మిర్యాలగూడ-కొండ్రపోల్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. మంగళవారం మృతుల కుటుంబ సభ్యులు వచ్చి మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచిన మృతదేహాలను గుర్తించారని, పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వారు పేర్కొన్నారు.

కన్న తండ్రిపై కుమారుడి దాడి

- తమ బాగోగులు చూడమని అడిగినందుకు ఘాతుకం


కుమారుడి దాడిలో గాయపడిన పాపిరెడ్డి

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): తమ బాగోగులు చూడమని అడిగినందుకు తండ్రిపై కొడుకు దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం ఆత్మకూర్ (ఎస్) మండల పరిధిలోని పాతసూర్యాపేట ఆవాసం శంకన్నగూడెంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. శంకన్నగూడెం గ్రామానికి చెందిన సామ పాపిరెడ్డి, సుగుణమ్మ దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు శంకర్‌రెడ్డి భార్యాపిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. వృద్ధులైన తల్లిదండ్రుల బాగోగులు చూడకపోగా.. వారి పేరు మీద ఉన్న 2.10 ఎకరాల భూమిని సైతం శంకర్‌రెడ్డి తన పేరున రిజిస్ట్రేషన్ చేయించుకుని కౌలుకు ఇస్తున్నాడు. భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకొని తమ బాగోగులు ఎందుకు చూడవని మంగళవారం పాపిరెడ్డి తన కుమారుడు శంకర్‌రెడ్డిని నిలదీశాడు. దీంతో కోపోద్రిక్తుడైన శంకర్‌రెడ్డి తన తండ్రిపై దాడికి పాల్పడ్డాడు. 9 నెలల క్రితం కూడా ఇదే విధంగా తన తల్లిదండ్రులపై శంకర్‌రెడ్డి దాడి చేశాడని కుమార్తెలు తెలిపారు. ఈ ఘటనపై పాపిరెడ్డి భార్య సుగుణమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

రైతాంగ సాయుధ పోరాట యోధురాలు మృతి


గుంటకండ్ల సుశీల (ఫైల్)

నాగారం: స్వాతంత్య్ర సమరయోధుడు, నాగారం గ్రామ తొలి సర్పంచ్ గుంటకండ్ల పిచ్చిరెడ్డి సతీమణి గుంటకండ్ల సుశీల(92) అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. కమ్యూనిస్టు పార్టీలో కీలకంగా పనిచేసిన సుశీల నాటి తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారు. కమ్యూనిస్టులు సాగించిన గెరిల్లా పోరాటాల్లో తన భర్త పిచ్చిరెడ్డితో కలిసి ఆమె పనిచేశారు. ఆమె భర్త పిచ్చిరెడ్డి గతేడాది అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డికి సుశీల పెద్దమ్మ అవుతుంది. బుధవారం గ్రామస్తుల సందర్శనార్థం నాగారం బంగ్లాకు ఆమె భౌతికకాయాన్ని తీసుకురానున్నారు. అనంతరం ఆమె పార్థివదేహాన్ని సూర్యాపేట మెడికల్ కళాశాలకు అప్పగించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గుంటకండ్ల సుశీల మృతి పట్ల జెడ్పీటీసీ కడియం ఇందిరాపరమేశ్వర్, గుంగాని అంబయ్యగౌడ్, గుంటకండ్ల ముకుందారెడ్డి, కల్లెటువల్లి ఉప్పలయ్య, కమ్యూనిస్టు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఎన్నిక


మెరుగు లింగయ్య


దొడ్డి అశోక్‌కుమార్

రామన్నపేట : తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్(711)జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హైదరాబాద్‌లోని నారాయణగూడలో రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కొండల్, వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్లా నరసింహ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా మెరుగు లింగయ్య(ప్రభుత్వ జూనియర్ కళాశాల, నస్తాన్ నారాయణపురం), దొడ్డి అశోక్‌కుమార్ (ప్రభుత్వ జూనియర్ కళాశాల రామన్నపేట), స్టేట్ కౌన్సిలర్లుగా మాల వెంకట్‌రెడ్డి, మండడి వెంకట్‌రెడ్డి, వి.అనంతయ్యలను ఎన్నుకున్నారు.

నీటి కుంటలో పడి వ్యక్తి మృతి

కేతేపల్లి: ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో మూడు రోజుల క్రితం జరిగగా.. మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని శివాలయం వీధిలో నివాసముంటున్న రూపాని నర్సయ్య(42) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. గత నెల 30న కేతేపల్లి మండలంలోని ఇనుపాముల గ్రామంలో కూలీ పనులు చేసేందుకు వచ్చిన నర్సయ్య తిరిగి రాత్రి పొద్దుపోయేవరకు ఇంటికి చేరుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు నర్సయ్య ఆచూకీ కోసం గత మూడు రోజుల నుంచి నకిరేకల్, ఇనుపాముల పరిసరాల్లో వెతికిన ప్పటికీ ఆచూకీ లభించలేదు. ఇదిలా ఉండగా మంగళవారం ఉదయం ఇనుపాముల శివారులోని కాటమయ్య కుంటలో నీటిపై తేలియాడుతున్న గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కుంట వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. నర్సయ్య ఆచూకీ కోసం అతడి కుటుంబ సభ్యులు ఇక్కడ వెతికారని స్థానికులు పోలీసులకు తెలపడంతో వారికి సమాచారం అందించారు. ఘటనా స్థలం వద్దకు చేరుకున్న కుటుంబ సభ్యులు మృతదేహం నర్సయ్యదేనని గుర్తించారు. నర్సయ్యకు మూర్ఛవ్యాధి ఉందని, బహిర్భూమికి వెళ్లిన సమయంలో మూర్ఛ రావటం వల్లనే ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి మృతిచెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. మృతదేహం ఉబ్బి, కుళ్లిపోయే స్థితిలో ఉండడంతో కుంట వద్దనే పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య సైదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కేతేపల్లి ఎస్‌ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

పైపుల ప్లేటు పగిలిన ప్రాంతం పరిశీలన

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలోని శివగంగా ఎత్తిపోతల పథకానికి సంబంధించిన సాగునీటి పైపుల ప్లేటు పగిలి నీరు వృథాఅవుతున్న ప్రాంతాన్ని నీటిపారుదల శాఖ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ స్వామి మాట్లాడుతూ.. పగిలిన ప్లేటును తొలగించి కొత్త ప్లేట్ బిగించి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏఈలు శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

దొండపాడు -2 ఎత్తిపోతల సర్వే పనులు ప్రారంభం


సర్వే చేస్తున్న నీటిపారుదల అధికారులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండలం దొండపాడు శివారులోని బుగ్గమాదారం వద్ద కృష్ణానదిపై నూతనంగా నిర్మించ తలపెట్టిన దొండపాడు- 2 ఎత్తిపోతల పథకం సర్వే పనులను అధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నీటిపారుదలశాఖ డీఈ స్వామి మాట్లాడుతూ ఈ లిఫ్ట్ ద్వారా నీటిని ఎత్తి మేళ్లచెరువు మండలం మంగలి కుంటతండా వద్ద గల ముక్త్యేశ్వర పురం మేజర్ 7వ, 19వ కిలోమీటరు వద్ద కాలువలో పోయనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా రామాపురం పరిధిలోని గోపాలరావు చెరువును కూడా నింపనున్నట్లు చెప్పారు. ఈ లిఫ్ట్ ద్వారా కందిబండ, మంగలికుంట తండా, కూచిపూడి, రామాపురం, దొండపాడు, గణపవరం, యతిరాజపురంతండా గ్రామాల పరిధిలోని సుమారు 8,500 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. ఈ వారంలో సర్వే పూర్తవుతుందని ఆయన తెలిపారు. సర్వే అయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఈ కానుగ శ్రీనివాస్, ఏఈ నాగార్జున, నాయకులు డీడీ రామయ్య, కె. మాధవరావు పాల్గొన్నారు.

స్వేరోస్ జాయింట్ సెక్రటరీగా కిరణ్


కిరణ్

కోదాడరూరల్ : స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన చెరుకుపల్లి కిరణ్ ఎన్నికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన నూతన కార్యవర్గ సమావేశంలో తనను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. స్వేరోస్ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన స్వేరోస్ ఫౌండర్, చైర్మన్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ తోపాటు ఎన్నికకు సహకరించిన ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మామిడాల ప్రవీణ్‌కుమార్, కోఆర్డినేటర్ శ్రీకాంత్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

'సదరం' సందడి


భార్యను బైక్‌పై తీసుకొస్తున్న భర్త

నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో మంగళవారం సదరం క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపునకు 100 మంది దివ్యాంగులు హాజరయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తున్న చేయూత పథకంలో పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి అంగవైకల్యం సర్టిఫికెట్ అవసరం ఉండడంతో దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాలకు చెందిన దివ్యాంగులు కుటుంబ సభ్యులతో కలిసి సదరం క్యాంపునకు తరలివచ్చారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ


సదరం క్యాంపులో బారులుదీరిన దివ్యాంగులు


తన కుమార్తెను సదరం క్యాంపునకు తీసుకొస్తున్న తండ్రి

టెంకాయలు విక్రయానికి రూ.11.40లక్షలకు వేలం


వేలంలో పాల్గొన్న ఎండోమెంట్ ఏసీ మహేందర్‌కుమార్, అనువంశిక ధర్మకర్తలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మహేందర్‌కుమార్ పర్యవేక్షణలో జరిగిన బహిరంగవేలంలో కొబ్బరి కాయలు(టెంకాయలు) అమ్ముకునే హక్కు రూ.11లక్షల 40వేలు పలికింది. ఈవేలాన్ని మట్టపల్లికి చెందిన దాసరి నాగలక్ష్మి కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్‌లు స్థానికంగా మాట్లాడారు. కొబ్బరికాయలు, తలనీలాలు, పూలు అమ్ముకునే హక్కులకు వేలం పాటలు నిర్వహించగా తలనీలాలు, పూలు అమ్ముకునేందుకు సరైన ధర రాకపోవడంతో వేలం పాట వాయిదా వేశామన్నారు. ఈకార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ రమేష్,పాలకమండలి సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుడి నిత్య కల్యాణం

మట్టపల్లి దేవాలయంలో శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, నిత్యఅగ్నిహోత్రి, మూలవిరాట్‌స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అదేవిధంగా శ్రీలక్ష్మీనృసింహస్వామి, రాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. కల్యాణతంతులో భాగంగా నూతన పట్టువస్త్రాలతో స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం మాంగళ్యధారణతో కల్యాణతంతు ముగించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరు మట్టపల్లిరావు దంపతులు, అర్చకులు పాల్గొన్నారు.

ప్రస్తుత పరిస్థితులు మొక్కజొన్న సాగుకు అనుకూలం

- నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు



నడిగూడెం: ప్రస్తుత యాసంగి సీజన్‌లో నీటి ఎద్దడి ఏర్పడడంతో మొక్కజొన్న సాగు చేయడం ప్రయోజనకరమని నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం. రాజగోపాలరావు సూచిస్తున్నారు. మొక్కజొన్న సాగు పై ఆయన సలహాలు, సూచనలు.. మొక్కజొన్నను జనవరి వరకు విత్తవచ్చు. విత్తేముందు మూడు, నాలుగుసార్లు బాగా దుక్కి దున్నాలి. సాళ్ల మధ్య 65–70 సెం.మీ. దూరం ఉండేలా చూడాలి. సాళ్లలో మొక్కల మధ్య 20 నుంచి 25 సెం.మీ. దూరం ఉండేలా విత్తుకోవాలి. ఒక ఎకరానికి సాధారణ రకాలైతే 7 కిలోలు విత్తనం అవసరం. ఎకరానికి 40 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం, 10 కిలోల పొటాష్ ఎరువులను విత్తే ముందు ఆఖరి దుక్కిలో వేయాలి. రెండోసారి నత్రజనిని సాళ్ళలో వేసి, మట్టి ఎగదోయాలి. పూతకు ముందు మరోసారి నత్రజని వేయాలి.

నీటి యాజమాన్యం : మొక్కజొన్న సాగులో పూత దశకు ముందు, పూత దశలో, గింజ పాలుపోసుకునే దశలో నీరు అవసరం. ముఖ్యంగా మురుగు నీరు పోయే వసతి ఉండేలా చూసుకోవాలి. సాళ్ల పద్ధతిలో నీరు పారించాలి. ఇలా చేయడం వలన నీరు వృథాకాదు. మొక్కజొన్న పైరులో జింక్ లోపం కనిపిస్తే 2 గ్రాములు జింక్ సల్ఫేట్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

ఆశించే పురుగులు, తెగుళ్లు..

1. కాండం తొలుచుపురుగు: ఇవి రెండు రకాలు. మచ్చలు లేక చారల కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఖరీఫ్ పైరును ఆశిస్తుంది. గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా యాసంగిలో మొక్కజొన్నను ఆశిస్తుంది. ఇవి పైరును 10–20 రోజులకు ఆశిస్తాయి. పిల్ల పురుగులు మొదటగా ఆకులపైన పత్రహరితాన్ని గోకి తింటాయి. తర్వాత ముడుచుకొని ఉన్న ఆకు ద్వారా కాండం లోపలికి చేరతాయి. ఈ ఆకులు విచ్చుకున్న తర్వాత గుండు సూది మాదిరి రంధ్రాలు లేదా పొడవాటి చిల్లులు ఆకులపై వరుస క్రమంలో కనిపిస్తాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వలన మొవ్వు చనిపోయి, ఎండిపోతుంది.

నివారణ చర్యలు: పొలంలో కలుపు మరియు చెత్తాచెదారం లేకుండా శుభ్రంగా ఉంచాలి. పురుగు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. పొలం చుట్టూ 3–4 వరుసల్లో జొన్నను ఎర పంటగా వేసి, 45 రోజుల తర్వాత తీసివేయాలి. అంతర పంటలుగా అపరాలను (కంది, సోయాబీన్, బొబ్బర్లు) సాగుచేయడం వలన సహజ శత్రువుల సంఖ్య పెరుగుతుంది. మోనోక్రోటోఫాస్ 320 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పైరు మొలకెత్తిన 10–12 రోజులకు పిచికారీ చేయాలి. అవసరమైతే కార్బోఫ్యూరాన్ 3జి గుళికలను ఎకరానికి 3కిలోలు చొప్పున మొలకెత్తిన 25–30 రోజులకు ఆకుల సుడులలో వేయాలి.

పాడి పంట

2. రసం పీల్చే పురుగులు: 30 రోజుల పైబడిన పైరును పేను బంక, చిగురు నల్లి ఆశించవచ్చు. పొడి వాతావరణంలో వీటి ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తల్లి, పిల్ల పురుగులు ఆకు లేక కాండం నుంచి రసాన్ని పీల్చడం వలన ఆకులు పసుపు రంగుకు మారిపోతాయి. మొక్క గిడసబారి పోతుంది. ఇవి విసర్జించే తేనె లాంటి జిగురు పదార్థానికి చీమలు చేరడమే కాకుండా శిలీంద్రాలు ఏర్పడి మసి తెగులు ఆశించడం వలన కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడి దిగుబడి తగ్గుతుంది.

నివారణ చర్యలు: సహజంగా అక్షింతల పురుగులు, సర్ఫిడ్స్ వంటి పరాన్నభుక్కులు మరియు పరాన్న జీవులు ఈ పురుగులను అదుపులో ఉంచుతాయి. రసం పీల్చే పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటే మోనోక్రోటోఫాస్ ఎకరానికి 320 మి.లీ. లేదా డైమీథోయేట్ 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

3. ఆకు ఎండుతెగులు: ఆకులపై పొడవైన కోలాకారపు బూడిద రంగుతో కూడిన ఆకుపచ్చ లేక గోధుమ వర్ణపు మచ్చలు కన్పిస్తాయి. ఈ మచ్చలు 2.5 సెం.మీ. నుండి 25 సెం.మీ. పొడవు మరియు 4 సెం.మీ. వెడల్పు ఉంటాయి. ఈ మచ్చలు మొదట మొక్క కింద ఆకులపై కన్పించి, పెద్దవై పై ఆకులకు కూడా వ్యాపిస్తాయి. అధిక తేమతో కూడిన వాతావరణంలో ఆకు అంతా ఎండి మొక్కలు చనిపోయినట్లుగా కన్పిస్తాయి. శిలీంద్ర బీజాలు ఆకుల అడుగు భాగాన వలయాలుగా కన్పిస్తాయి. ఈ మచ్చలు కండెపై ఉన్న పొట్టుపై కూడా వ్యాపిస్తాయి.

పంట కాలం

మొక్కజొన్న పొత్తు తయారైన తర్వాత కండెపై గల పొరలు ఎండి గింజ మొదట్లో నల్లటి చారలు ఏర్పడి పంట పరిపక్వతను సూచిస్తాయి. కండెను తెంపి 3-4 రోజులు ఎండలో ఆరబెట్టాలి. కండెల నుండి గింజలను తీసేందుకు షెల్లర్ అనే యంత్రాన్ని వాడితే ఖర్చు ఆదా అవుతుంది. పేలాల (పాప్‌కార్న్) రకం వేసినప్పుడు గింజల్లో 30-35 శాతం తేమ ఉన్నప్పుడే కండెలు కోసి, నీడలో ఆరబెట్టాలి. తీపి కండె రకం వేసినప్పుడు గింజ పాలు పోసుకొనే దశలో కండెలు కోసుకోవాలి. అంబర్ పాప్‌కార్న్, మాధురి రకాలను గింజలు కట్టకముందే కోసి బేబీకార్న్‌గా వాడుకోవచ్చు. పశువుల మేత కోసం విత్తితే 50 శాతం పూత దశలో పైరు కోసుకొని గ్రాసంగా ఉపయోగించుకోవచ్చు.

4. తుప్పు తెగులు: ఆకులపై రెండు వైపులా గుండ్రని లేక పొడవాటి గోధుమ వర్ణపు పొక్కుల మాదిరిగా తెగులు లక్షణాలు కనిపిస్తాయి. పంట పెరిగిన కొలది ఆకులపైన పొక్కులు గోధుమ వర్ణం నుంచి నలుపు వర్ణానికి మారుతాయి. పూత సమయంలో తెగులు లక్షణాలు స్పష్టంగా కన్పిస్తాయి. అధిక తేమ గల చల్లని వాతావరణంలో తెగులు ఉధృతి మరియు వ్యాప్తి ఎక్కువగా ఉంటుంది. పై రెండు రకాల తెగుళ్ల నివారణకు మాంకోజెబ్ ఎకరానికి 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి తెగులు తీవ్రతను బట్టి ఒకటి లేక రెండు సార్లు పిచికారీ చేసి సమర్థవంతంగా అరికట్టవచ్చు. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రాములు మాంకోజెబ్‌తో కలిపి విత్తన శుద్ధి చేయాలి.